క్లుప్తంగా

విచారణ చేపట్టాలని ఫిర్యాదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీ సొసైటీలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేయాలని కోరుతూ బుధవారం విద్యుత్‌నగర్ కాలనీ వాసులు సంతకాల సేకరణచేసి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం కాలనీలో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించడం లేదని, చేయని ఖర్చులను చేసినట్లు చూపుతున్నట్లు ఆరోపించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారని కాలనీ మాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి తెలిపారు.

మహాయాగానికి తరలిన భక్తులు



మహాయాగానికి వెళుతున్న సేవా సభ్యులు

నారాయణఖేడ్: చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతిస్వామి మహాయాగం నిర్వహించారు. బుధవారం నిర్వహించిన అతిరుద్ర మహాయాగం, లక్ష తమలపాకుల అర్చనకు ఖేడ్ లలితాదేవి వైభవం ట్రస్ట్ నిర్వాహకులు మలమంచి మోహన్ జోషి నేతృత్వంలో మహిళాసేవా సభ్యులు తరలివెళ్లారు.


జీవాలకు టీకాలు తప్పనిసరి



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

పటాన్‌చెరు టౌన్: గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి శైలేంద్ర జైస్వాల్ పిలుపునిచ్చారు. మండలంలోని క్యాసారం గ్రామంలో బుధవారం పశువులకు గొంతువాపు, తొడవాపు వ్యాధుల నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని మొత్తం 326 గొర్రెలు, మేకలకు టీకాలు వేశామన్నారు. ఈ టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే ఆర్టీసీ లక్ష్యం



ఫిర్యాదులు తీసుకుంటున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. బుధవారం స్థానిక డిపోలో డైల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి కొందరు ఫోన్‌ద్వారా తమ ఫిర్యాదులు, సమస్యల గురించి తెలిపారు. నారాయణఖేడ్ నుంచి రేగోడ్ మీదుగా హైదరాబాద్‌కు బస్సు నడపాలని, కంగ్టికి నైట్ అవుట్ బస్సు, అలాగే హైదరాబాద్‌కు బస్సులు నడపాలని కొందరు కోరారు. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని డీఎం వారికి హామీ ఇచ్చారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు



బైక్‌ను ఢీకొట్టిన బస్సు

జిన్నారం(పటాన్‌చెరు): ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన జిన్నారం మండలంలోని గడ్డపోతారం ప్రధాన రహదారిపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దమ్మగూడెనికి చెందిన తాళ్లపల్లి భిక్షపతి షాపూర్‌నగర్‌లో పాలుపోసి తిరిగి జిన్నారానికి తన బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో గాయపడిన భిక్షపతిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో దగా

తరుగు, తేమ పేరుతో కోతలు
- వెంటనే అందని పత్రాలు
- దోపిడీకి గురవుతున్న రైతులు



ధాన్యాన్ని లారీలకు ఎక్కిస్తున్న కూలీలు

పంట పండించడం కంటే అమ్మడానికే రైతులు ఎక్కువగా కష్టపడాల్సి వస్తోంది. ఆరుగాలం చెమట చిందించి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లోపంవల్ల రైతులు అడుగడుగునా మోసపోతున్నారు. నిలువు దోపిడీకి గురవుతున్నారు. రైస్‌మిల్లుల యజమానులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, డ్రైవర్లు కలిసి వివిధ రకాలుగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– వట్‌పల్లి(అందోల్)

జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో రైతులు 1.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించారు. 211 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైస్‌మిల్లు యజమానులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిలువునా మోసం చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. మొదట తేమ పేరుతో ధాన్యంలో ప్రతిబస్తాకు 2.5కిలోల ధాన్యాన్ని తరుగు అంటూ కోత విధిస్తున్నారు. తరలింపులో లారీ డ్రైవర్లు రైతుల వద్ద అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని ఆరోపణలున్నాయి.

తేమ పేరుతో కోత...

రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి ఆరబెట్టుకుంటున్న సమయంలో వారం, పదిరోజులపాటు కురిసిన అకాల వర్షాలతో తడిసి ముద్దయింది. కొన్నిచోట్ల ధాన్యం మొలకలు కూడా వచ్చాయి. ఆ ధాన్యాన్ని మిల్లర్లకు తరలించినా తేమ పేరుతో బస్తాకు 2నుంచి 5 కిలోల తరుగు ఇస్తేనే దిగుమతి చేసుకోవడంతో రైతులు చాలా వరకు నష్టపోయారు.

కొనుగోలు పత్రాలు ఇవ్వరా?

ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే కొనుగోలు పత్రాలను రైతులకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించినా పత్రాలను ఇవ్వడంలేదని రైతులు చెబుతున్నారు. తూకంవేసి రైస్ మిల్లులకు తరలించిన తర్వాత ధాన్యంలో మిల్లర్లు కోత విధిస్తే దానిని కూడా రైతులపై వేసి ఆ తర్వాతనే పత్రాలు అందజేస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో రెండున్నర కిలోలు, రైస్‌మిల్లులో రెండు కిలోల వరకు తరుగు పేరుతో తొలగిస్తున్నారు. గత్యంతరం లేక పత్రాలను తీసుకోవాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలీల శ్రమ దోపిడీ

కొనుగోలు కేంద్రాల్లో కూలీల శ్రమను కేంద్రం నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారు. అందోలు నియోజకవర్గంలోని చాలా చోట్ల బిహార్ ప్రాంతానికి చెందిన కూలీలే ఎక్కువగా పనిచేస్తున్నారు. రైతుల నుంచి క్వింటాలుకు రూ.45 చొప్పున వసూలుచేసి వారికి మాత్రం రూ.40 చొప్పునే చెల్లిస్తున్నారు. మిగిలిన రూ.5 ఎవరి అక్కౌంట్‌లకు చేరుతున్నాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రూ.45 వసూలు చేస్తున్నారు..



కొనుగోలు కేంద్రాల వద్ద కూలీల పేరుతో రైతుల వద్ద క్వింటాలుకు రూ.45 వసూలు చేస్తున్నారు. కూలీలకు మాత్రం రూ.40 మాత్రమే చెల్లించి వారి శ్రమను దోచుకుంటున్నారు. వారి కూలి డబ్బులను దోచుకోవడం సరికాదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎర్ర బాగయ్య, రైతు, అందోలు

అదనంగా వసూలు చేస్తే చర్యలు

కూలీల పేరుతో కొనుగోలు నిర్వాహకులు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న విషయం ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. క్వింటాలు ధాన్యం చొప్పున రైతుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని కూలీలకే చెల్లించాలి. ఈ విషయంపై విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, డీసీఓ, సంగారెడ్డి జిల్లా

ట్రాఫిక్ రూల్స్ బేఖాతర్



ధ్వంసమైన డివైడర్ సూచికలు

సంగారెడ్డి టౌన్: తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ఉద్దేశంతో పోలీసులు, రవాణాశాఖ అధికారులు ఎన్ని చర్యలు చేపడుతున్నా వాహనదారులు మాత్రం వాటిని బేఖాతర్ చేస్తున్నారు. పట్టణంలో పెరిగిన జనాభా, వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఇటీవల పాత బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రోడ్డు మధ్యలో సూచికలు ఏర్పాటు చేశారు. అయితే వాహనదారుల నిర్లక్ష్యమో.. అధికారుల పర్యవేక్షణ లోపమో తెలియదు కానీ.. చాలా చోట్ల అవి ధ్వంసమయ్యాయి. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. కొంతమంది వాహనదారులు తమ ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారు. సూచికలను ఏర్పాటు చేసిన అధికారులు వాటిపై సరైన నిఘాపెట్టి ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటే ఇలాంటివి జరగవని స్థానికులు అంటున్నారు. వాహనదారుల చిన్న నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు బలవుతున్నా వారిలో ఎలాంటి మార్పు రావడం లేదని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మొక్కలను సిద్ధంగా ఉంచండి

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా



పటాన్‌చెరు టౌన్: మొక్కలను పరిశీలిస్తున్న సాయిబాబా

పటాన్‌చెరు టౌన్: హరితహారం కోసం నర్సరీలలో మొక్కలను సిద్ధంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఆదేశించారు. మండల పరిధిలోని ఘణపూర్ గ్రామంలో మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్‌తో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని వైకుంఠ ధామం, డంపింగ్ యార్డ్, రైతు వేదిక, నర్సరీలతో పాటు పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్మి కంపోస్ట్ ఎరువులను తయారుచేసి నర్సరీలకు పంపిణీ చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యలోపం, తాగునీరు, విద్యుత్ దీపాల సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాశమైలారం కార్యదర్శి రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను డంప్‌యార్డుల్లోనే వేయాలి

కంది(సంగారెడ్డి): ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల్లోనే వేసేలా చూడాలని డీపీఓ సాయిబాబా అధికారులకు సూచించారు. మండల పరిధిలోని కవలంపేట పంచాయతీని ఆయన తనిఖీ చేశారు. తడి, పొడిగా వేరుచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో అప్రమత్తత అవసరం



మునిపల్లి(అందోల్): రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శివకుమార్



కల్హేర్(నారాయణఖేడ్)లో.. ఏఈఓ కృష్ణవేణి

వ్యవసాయాధికారి శివకుమార్

మునిపల్లి(అందోల్): విత్తనాలు కొనుగోలుచేసే ముందు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి శివకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో బుధవారం రైతులకు విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విత్తనాలు తీసుకోగానే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రెహమాన్, రైతులు పాల్గొన్నారు.

బిల్లు లేకుండా కొనొద్దు

కంగ్టి(నారాయణఖేడ్): తదితర విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని ఏఈఓ సంధ్యారాణి సూచించారు. మండలంలోని ముర్కుంజాల్ శివారులో రైతులకు విత్తన కొనుగోలుపై అవగాహన కల్పించారు. అధిక దిగుబడులు సాధించే విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు.

కల్హేర్(నారాయణఖేడ్)లో..

కల్హేర్ మండలం మీర్ఖాన్‌పేట, నిజాంపేట మండలం మునిగేపల్లిలో ఏఈఓ కృష్ణవేణి రైతులకు విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విడిగా ఉన్న ప్యాకెట్‌లోని విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. విత్తన ప్యాకెట్ మీద అవి తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీ చూసుకోవాలని చెప్పారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

- నీటి సమస్య లేకుండా చూడాలి
- ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషిచేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పిలుపునిచ్చారు. ఎంపీపీ అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన బుధవారం హత్నూర మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాలలో సీసీరోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా ఎలక్షన్ కోడ్ వల్ల పనులు నిలిచిపోయాయని ఇప్పుడు వాటిని వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడా పైప్‌లైన్ లీకేజీలు లేకుండాచేసి, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హరితహారంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని సూచించారు. మండలంలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. మండల స్థాయి అభివృద్ధిపై అధికారులు తమ నివేదికలను సభ్యులకు వివరించారు. సమావేశంలో ఎంపీపీ నర్సింహులు, జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీడీఓ శంకర్, ఎంపీటీసీలు, ప్రత్యేక పంచాయతీ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిధుల కొరత తీర్చాలని వినతి

పంచాయతీలో నిధుల కొరత సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. నిధులు లేక గ్రామ సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని, పారిశుద్ధ్య కార్మికులకు సైతం వేతనాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నామని ఆమెకు వివరించారు. నిధుల కొరతను తీర్చేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి కార్యదర్శులకు హామీ ఇచ్చారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు గుర్తింపు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు వల్లూరి ఫౌండేషన్ గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి బంగారు నంది అవార్డులు అందజేయనుంది. ఈ అవార్డులకు మండలానికి చెందిన ఏడుగురు ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు ఆ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా వీఆర్ శ్రీనివాసరాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల విద్యాధికారి దండు అంజయ్య, నిజాంపూర్(కె), తంగడపల్లి, నాగ్సాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు రామకృష్ణ, తుల్జయ్య, వెంకటేశం అలాగే మద్దికుంట, ఎల్లారం, అంకెనపల్లి ఉపాధ్యాయులు గుణాకర్, చక్రధరరావు, రామలక్ష్మి అవార్డుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వారంతా వచ్చే నెల 9న రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, సినీ హీరో సుమన్ చేతుల మీదుగా పురస్కారాలను అందుకోనున్నారు.

మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని ఇంద్రేశం గ్రామ సమీపంలోని ముత్తూట్ ఫైనాన్స్ సమీపంలో ఓ గుర్తుతెలియని మహిళ మృతిచెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు మాట్లాడుతూ ఆమె వయసు 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని చెప్పారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

గడ్డి వాము దగ్ధం

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని పెద్ద చింతకుంటలో జరిగింది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగలి రుక్కులుకు చెందిన గడ్డివాముకు నిప్పంటుకుంది. పలుమార్లు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించలేదని గ్రామస్తులు తెలిపారు.

గుంతను పూడ్చండి సారూ..



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారిపై ఉన్న ఓ గుంత ప్రమాదకరంగా మారింది. కొంత కాలంగా చాలా మంది వాహనదారులు ఈ గుంతలో పడి గాయాలబారిన పడుతున్నారు. గుంతను పూడ్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రైతు భరోసా విడుదల చేయాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి: ఈ వానాకాలంలో వ్యవసాయపనులు ప్రారంభం కాకముందే ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుభరోసా నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఎరువులు, విత్తనాల కోసం చెప్పులు లైన్‌లో పెట్టినట్టు, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టే పరిస్థితి నెలకొందన్నారు. నకిలీ విత్తనాలపై వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు సరఫరాచేస్తే పీడీ యాక్ట్‌కింద కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలను అందించి, బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

ఝరాసంగం(జహీరాబాద్): ఎరువులను ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, లైసెన్సు, స్టాక్ బోర్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ధరల పట్టికను కొనుగోలుదారులకు కనిపించే విధంగా ఉంచాలని, విత్తనాలు కొనుగోలుచేసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల ఏఈఓలు సుకుమార్, శివప్రియ, సంపత్, జ్ఞానం తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా జొన్నల కొనుగోళ్లు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ అభినాష్‌వర్మ

రాయికోడ్(అందోల్): రైతులకు ఏ ఇబ్బంది కలకుండా జొన్నల కొనుగోలులో వేగం పెంచాలని మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేంద్రంలో జొన్నల కొనుగోలు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. రైతులు, కేంద్రం నిర్వాహకులు, కూలీలతో మాట్లాడి పలుసూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ త్వరితగతిన టోకెన్లు జారీ చేయాలని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం కొనుగోలు ప్రక్రియను కొనసాగిస్తున్నామని కేంద్రం నిర్వాహకుడు యాదగిరి తెలిపారు. రెండు రోజుల నుంచి సుమారు 150 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేశామన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే చర్యలు

శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు



అవగాహన కల్పిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: చెత్తను పారిశుద్ధ్య కార్మికులకే అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పటాన్‌చెరు డివిజన్‌లో చెత్తను రహదారులపై వేయవద్దంటూ బుధవారం అవగాహన కల్పించారు. అందుకు సంబంధించిన పోస్టర్లను గోడలకు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే చర్యలు తప్పవన్నారు. ఎవరు, ఎక్కడ చెత్త వేస్తున్నారో వివరాలు సేకరిస్తున్నామని, తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా బదిలీలు, పదోన్నతుల్లేవు



సంఘం జెండాను ఎగురవేస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు పి.చంద్రప్రకాశ్ కోరారు. బుధవారం టీపీటీఎఫ్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం ఎంఆర్‌సీ భవనం ఎదుట జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు లేవని, చాలా మంది ఉపాధ్యాయులు పదోన్నతులు లేకుండానే పదవీ విరమణ చేశారని వాపోయారు. సాయిలుచారి, సర్ఫరాజ్ అలీ, అబ్దుల్ అజీం, డి.చంద్రశేఖర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

జహీరాబాద్ టౌన్: స్థానిక ఎంఆర్సీ కార్యాలయం వద్ద టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలను ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం యూనియన్ జెండాను ఆవిష్కరించారు. పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో నెలకున్న సమస్యలపై నిరంత పోరాటం చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, బిచ్చయ్య, నాగేశ్వరావు, రాంచందర్ భీం వంశీ, జీవన్‌రావు, నర్సింహులు, అనంత్‌రావు, అమృత్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.